# సహధర్మం

**-సింగరాజు రమాదేవి**

ప్రకాశరావుకి అంతా అగమ్యగోచరంగా ఉంది. అసలు జీవితంలో అతను ఎప్పుడూ ఇంతగా బుర్రలు కొట్టుకోవాల్సిన అవసరం రాలేదు. ఏ విషయం గూర్చి ఇంత తీవ్రంగా ఆలోచించాల్సిన పని పడలేదు. అలాంటిది ఇప్పుడు ఎటూ దిక్కు తోచట్లేదు. ఏమీ పాలుపోవడంలేదు. ఎవరిని సలహా అడగాలో తెలియడంలేదు. ఇంటిదైనా, బైటదైనా, ఆఫీసుదైనా అరవై ఏళ్ల ఈ జీవితంలో ఇరవైయ్యవ ఏట పెళ్లయ్యాక ఏ సమస్య అయినా శ్రీమతితో పంచుకుని చర్చించి ఆమె సలహాపై నడవడం అలవాటు. కానీ ఇప్పుడు ఈ వయసులో ఈ సమస్య ఏంటి? ఛ... ఎంత ఆలోచించినా అంతు చిక్కడం లేదు. కారణం తెలియడంలేదు.

పార్కులో చీకట్లు ముసురుకుంటున్నాయి. దోమలు కూడా విజృంభించి కుట్టడం మొదలుపెట్టాయి. అప్పటికే అతడు సాయంత్రం నడకకని వచ్చి పార్కులో కూర్చుని రెండు గంటలు అయింది. ఇంటికెళ్లాలంటే ఏదో గుబులుగా ఉంది. అయినా తప్పదుగా! గాఢంగా నిట్టూర్చి లేచి ఇంటి దారి పట్టాడు.

ఇంటి బయట లైట్లు వెలగడంలేదు. చూస్తే తలుపుకు వేలాడుతున్న తాళం కప్ప. పక్కవాటా తలుపు కొట్టాడు.

అద్దెకున్న వాళ్లమ్మాయి వచ్చి తాళం చెవి చేతిలో పెట్టి లోపలకు వెళ్లిపోయింది. ఆంటీ ఎక్కడికెళ్లింది? నోటిదాకా వచ్చిన ప్రశ్నను అలాగే లోపలకు మింగేసాడు.

తలుపు తెరుచుకుని లోపలికెళ్లాడు. లోపల కూడా లైట్లు వేసి లేవు.

టైము ఏడున్నర. వంటింట్లోకి వెళ్లి చూసాడు. వంట చేసిన ఛాయలులేవు.

అసలు లలిత ఎటు వెళ్లినట్లు చెప్పా పెట్టకుండా? పైగా వంట అదీ ఏమీ చేయకుండా. గ్లాసు మంచినీళ్లు తాగి బెడ్రూమ్‌లోకి వచ్చాడు. మంచంమీద ఆమె విడిచిన చీర కాబోలు కుప్పగా పడి ఉంది. ఇంకోపక్క తుడుచుకున్న తడి తుండు ఇంకా అలాగే ఉంది. వాటిని పక్కకి తోసి నిస్త్రాణగా మంచంపై వాలిపోయాడు ప్రకాశరావు.

ఎందుకిలా విరుద్ధంగా ప్రవర్తిస్తోంది లలిత? ఇల్లెంత శుభ్రంగా ఉంచేది.

తను లుంగీ, తడి టవలు మంచం మీద వదిలేస్తే వెంటనే తీసేసేది. కాఫీ కప్పులు, టిఫిన్ ప్లేట్లు, ఎక్కడి వస్తువులు అక్కడే వదిలేసేవాడు. అయినా ఎప్పటికప్పుడు సర్దేస్తూ ఉండేది. తనూ పిల్లలు సరదాగా ఏడిపించేవాళ్లం కూడా మరీ అంత శుభ్రం పనికిరాదని.

వంట కూడా అద్భుతంగా చేసేది. రెండుపూటలా రకరకాల టిఫిన్లు, అన్నిరకాల కూరలు, పచ్చళ్లు పగలు రాత్రి భోజనాలు.

తన ఆఫీసులో వాళ్లని పెద్ద పెద్ద ఆఫీసర్లని, మేనేజర్లని, గొప్పగా పిలుచుకుని వచ్చేవాడు తన ఇంటికి భోజనానికి.

అందరికీ ఓపిగ్గా, ఆప్యాయంగా షడ్రసోపేతంగా వండి పెట్టేది లలిత. నిజం చెప్పాలంటే తనకు ఒకటి రెండు ప్రమోషన్లు వాటివల్లే లభించాయి కూడా.

తానెప్పుడూ ఆఫీసు పనులలోనే మునిగితేలుతుండేవాడు కాబట్టి పిల్లల చదువులు, ఆటపాటలు అన్నీ కూడా తనే చూసుకునేది. పిల్లలు ఏ క్లాసో కూడా తనకు ఒక్కోసారి గుర్తుండేదికాదు.

అలాంటిది హఠాత్తుగా ఇలా మారిపోయిందేమిటి? మళ్లీ ప్రకాశరావు ఆలోచనలు మొదటికే వచ్చాయి.

టైము చూసాడు.

ఎనిమిదయ్యింది. లలిత ఇంకా రాలేదు. అతనిలో తెలియకుండానే సన్నగా ఆందోళన మొదలయింది.

అసలు ఎటు వెళ్లింది ఇంతసేపు? కొంపదీసి ఏ అఘాయిత్యం అయినా? ఛ...ఛ...అదేమీ కాదు!

ఇంతలో గేటు తీసిన చప్పుడయింది. అతనికి ప్రాణం లేచివచ్చినట్లయింది. అంతే... ఒక్క ఉదుటున లేచి వెళ్లి హడావుడిగా తలుపు తీసాడు.

లలితను చూడగానే "ఎక్కడికెళ్లావు? నువ్వింకా రాకపోతే నేనెంత గాబరా పడ్డానో తెలుసా?" అన్నాడు.

అతన్ని దాటి లోపలకు వెళ్లబోతున్నదల్లా వెనక్కి తిరిగి తల ఒక పక్కకి వంచి "ఎందుకు?" అని అడిగింది. ఆమె అడిగిన తీరులో, ఆ చూపులో అతనికి ఎన్నో అర్థాలు గోచరించాయి.

**ఆంధ్రభూమి దినపత్రిక కథల పోటీలో ఎంపికైన కథ**

"అదే...అదే..'' తెలియకుండానే తడబడ్డాడు.

ఆమె నుదుటిన కుంకుమ, చేతిలో కొబ్బరిచిప్ప చూసి "ఓహో గుడికా? అదే ఆలస్యమయితేనూ?' సంజాయిషీగా అన్నాడు.

ఆమె మౌనంగా కాళ్లు కుడుక్కుందుకు బాత్రూమ్‌వైపు వెళ్లిపోయింది. కాసేపాగి వంటింట్లో ఏదో గిన్నెల చప్పుడు.ప్రకాశరావు హాల్లో సోఫాలో కూలబడ్డాడు. ఆమె ఇదే తంతు. చాలామటుకు మౌనం. మాట్లాడినా, మాటల్లో తెలీని కాఠిన్యం. అది అలిగినట్లులేదు. పెళ్లయితే కొత్తల్లో... కొత్తల్లో ఏం ఖర్మ? మొన్నిమధ్య వరకూ ఆమె అప్పుడప్పుడూ అలుగుతూనే ఉండేది. అయితే ఆ అలకలో ఒక మురిపెం, ఒక దగ్గరితనం అతడు తనని బతిమాలి మురిపించాలనే ఆరాటం ఉండేది.


కానీ ఇప్పుడు ఇది అలాకాదు, కోపమూ కాదు. ఘనీభవించిన ఒక నిశ్శబ్దం. ఛేదించలేని ఒక మౌనపు అడ్డుగోడ. ఆమె మొహంలోని ఒకానొక కరడుగట్టిన నిర్లిప్తత అతన్ని దరి చేరనివ్వడంలేదు. అసలు ఏ ప్రయత్నం చేసి దగ్గరయి స్వాంతన చేకూర్చాలో అర్థం కావడంలేదు.

అతను ఆలోచనల్లో ఉండగానే ఆమె డైనింగ్ టేబుల్‌పైన గిన్నెలు సర్ది "భోజనానికి రండి'' అని పిలిచింది.

ఆ పిలుపులో ఎంత తేడా? 'భోజనానికి వస్తారా?' అని అడగలేదు.

అబ్బ...ఇంకెంతసేపు రండి అని విసుక్కోలేదు. అలా అని మర్యాదా లేదు. అది ఒక వాక్యం అంతే.

అందులో ఏ భావంలేదు, భాష తప్ప. అసలు భావమేలేదా? ఉంది. ఇన్నేళ్లు ఇంతటి ప్రేమానురాగాలు పంచిన ఆమె ఇంత అభావంగా రాయిలా మారిందంటే కారణం ఖచ్చితంగా ఉండే



ఉంటుంది. అవును వుంటుంది.

తను కనుక్కోవాలి. కనుక్కుంటాడు. దృఢ నిశ్చయంతో లేచాడు ప్రకాశరావు.

★★★

"బహుశా ఈ వయసులో ఇలాంటి సమస్య ఎవరికీ రాదేమో!" పార్కులో బెంచిపైన కూర్చుని స్నేహితుడు వెంకట్రావుతో అన్నాడు ప్రకాశరావు.

"ఏమిటోయ్ ప్రకాశం... వింతగా ఉంది. ఇన్నాళ్లు కాపురం చేసాక ఇవాళ భార్యతో తగాదా కొత్తా? కారణం తెలీక కొట్టుమిట్టాడుతున్నావా? అయినా నాకు తెలిసీ లలితమ్మ చాలా అనుకూలమైనది కదా. అలాంటిది నీతో సరిగ్గా మాట్లాడకపోవడం ఏమిటి? నాకు చాలా ఆశ్చర్యంగా కూడా ఉంది. దూర దూరంగా మెలగడం ఏమిటి? ఒక్కటిమాత్రం చెప్పాలోయ్. కారణం లేకుండా ఆమె అలా ప్రవర్తించదు. నిర్మొహమాటంగా అసలు ఇదంతా ఎప్పుడు మొదలైందో, దాని ముందు జరిగిన సంఘటనలు ఏమిటి అన్నీ సక్రమంగా గుర్తు చేసుకుని ఏదీ వదలకుండా విడమర్చి చెప్పు" అన్నాడు వెంకట్రావు.

ప్రకాశరావు చెప్పడం మొదలుపెట్టాడు.

★★★

వందనా గార్డెన్స్. నగరంలో ప్రసిద్ధి చెందిన ఫంక్షన్ హాల్. పేరుకు తగ్గట్టు చక్కటి లాన్, రకరకాల పూల మొక్కలు, క్రోటన్‌లతో వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది. చల్లటి సాయంత్రపు పిల్లగాలికి మొక్కలు మెల్లమెల్లగా వూగుతున్నాయి.

వేదిక అంతా దండలతో, రంగు కాగితాలతో అద్భుతంగా అలంకరించి ఉంది.

మధ్యలో ఒక పెద్ద ఎర్రటి మఖమల్ కుర్చీ. స్పీకర్లనుండి చక్కటి శ్రావ్యమైన వాద్య సంగీతం మంద్రస్థాయిలో వినిపిస్తోంది.

మంచి సన్నజాజుల పరిమళం స్ప్రే చేసినట్లున్నారు. గాలంతా వ్యాపించి ఉంది.

అక్కడ వేసివున్న వంద కుర్చీలు నిండి పోయాయి. వచ్చినవారంతా ఒక ప్రత్యేక వ్యక్తి కోసం ఆరాటంగా ఎదురు చూస్తున్నారు.

చాలామందికి అక్కడ జరగబోయే ఫంక్షన్ ఏమిటో తెలియదు. ఒక ప్రత్యేకమైన వ్యక్తికి ప్రత్యేక వేడుక అంటే ఆసక్తితోను, కుతూహలంకొద్దీ దగ్గరతనంకొద్దీ వచ్చి కూర్చున్నారు.

కారు దిగి ఠీవిగా హాలులోకి అడుగుపెట్టింది లలిత. వంకాయ రంగు అంచుగల ఆకుపచ్చ రంగు గద్వాల చీర, చెవులకు తెల్లరాళ్ల దుద్దులు, నుదుట పెద్ద ఎర్రటి బొట్టుతో చక్కటి ముడిగా చుట్టుకున్న కురులు, పెదవులపై చిరుదరహాసంతో హుందాగా, చూడగానే గౌరవం కలిగేలా ఉంది ఆమె రూపం.

"ఇంతకీ ఫంక్షన్ ఎవరిదో చెప్పారుకాదు" ఇల్లు బయలుదేరాక మొదటి సారి నోరు విప్పుతూ అడిగింది లలిత.

"చూస్తావుగా?" అంటూ ఆమెను ముందు వరుసలో కూర్చోబెట్టి సరాసరి వేదిక నెక్కిన ప్రకాశరావు మైకు అందుకుని మాట్లాడడం మొదలుపెట్టాడు.

"ప్రత్యేకించి సందర్భం ఏమిటో చెప్పకపోయినా నా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి విచ్చేసిన మీ అందరికీ నా హృదయపూర్వక స్వాగతం. లలిత గత నలభై ఏళ్లుగా నా సహధర్మచారిణి. ఇన్నేళ్లల్లో ఆమె నానుండి దూరంగా ఉన్నది ఏ వారం పదిరోజులో అదీ ఆమె తల్లిదండ్రులు మరణం వంటి అత్యవసర పరిస్థితుల్లో. మిగిలిన ఇన్నేళ్ల జీవితం, ఆమె కేవలం నేను, మా పిల్లలు, అత్తగారు, ఆడబడుచులువంటి కుటుంబ సభ్యుల బాగోగులు చూడడంలో, బాధ్యతలు నెరవేర్చడంలో గడిపేసింది. వారి సుఖసంతోషాలే తన సుఖ సంతోషాలుగా చేసుకుంది. వారికి ఏ కష్టం వచ్చినా ఆమె తల్లడిల్లిపోయేది. వెయ్యి దేవుళ్లకు మొక్కుకునేది. మీకనిపించవచ్చు ఇందులో వింతేముందని? ప్రతి ఇల్లాలూ, లేకపోతే కనీసం 90 శాతం ఇల్లాళ్లు చేసే పనులేగా ఇవి అని. ప్రతి ఇంట్లో జరిగే కథే కదా ఇది అని."

వింటున్న లలిత మొహంలో రంగులు మారుతున్నాయి.


ఒక నిముషం ఆమె వంక చూసి మళ్లీ తన ప్రసంగాన్ని కొనసాగించాడు ప్రకాశం.

"వారం క్రితం వరకు నేను అంతే. కానీ నా స్నేహితుడు వెంకట్రావు, నా



## ఆసక్తికరమైన యాడ్!

ఐపిఎల్ టీమ్స్‌లో పంజాబ్‌కి ఓనర్ అయిన ప్రీతీ జింతా చెన్నయ్ టీమ్ కెప్టెన్ అయిన ధోనీతో కలిసి ఓ యాడ్ చేయడం అంతటా చర్చనీయాంశంగా తయారైంది. మైదానంలో రెండు టీములూ గెలుపు కోసం హోరాహోరీ పోరాటం సాగిస్తాయి. అలాంటి నేపథ్యంలో ఇద్దరు ప్రత్యర్థులూ కలిసి ఓ యాడ్ చేయడం ఆసక్తికరంగా వుంటుంది. ఇమామి కంపెనీకి సంబంధించిన ఈ యాడ్‌లో కూడా వైరివర్గాల్లాగానే చిత్రీకరణ వుంటుందిట. కాకపోతే కాస్త హాస్యంగా వుంటుంది- అని నవ్వుతోంది ప్రీతి.



భార్య లలిత నా కళ్లు తెరిపించారు. లలిత నాతో ఇదివరకట్లా లేదని, ఆమె ప్రవర్తనలో ఏదో తేడా ఉందని నా మిత్రునితో చెప్పాను.

***

"అసలు ఇదంతా ఎప్పుడు మొదలైంది, దాని ముందు జరిగిన సంఘటనలు ఏమిటి? అన్నీ సక్రమంగా గుర్తు చేసుకుని ఏదీ వదలకుండా చెప్పు" అన్నాడు వెంకట్రావు.

నేను ఓ పదిరోజులు వెనక్కి వెళ్లి "ఆ... గుర్తుకొచ్చింది. ఇదంతా ఆ రోజే మొదలయింది. 31వ తేదీ నా రిటైర్‌మెంట్ తేదీ. ఆ రోజు ఫంక్షన్‌కు నువ్వూ హాజరయ్యావుకదా" అన్నాను.

"అవును చాలా బ్రహ్మాండంగా ఉంది. ఆఫీసులో ప్రతి ఒక్కరూ నీ పనితనం గురించీ, ఆఫీసుకు నువ్వు చేసిన సేవ గురించి, ఆఫీసులో పైవారితో, క్రిందివారితో నువ్వు సాగించిన సత్సంబంధాల గురించి గొప్పగా పొగిడారు."

'అవును ఆ రోజు నిజంగా నా జీవితంలో ఎన్నటికీ మరచిపోలేనిరోజు. ఆ రోజు నాకు జరిగిన సత్కారం, వేసిన పూలదండలు, కప్పిన శాలువా, అందరూ ప్రేమతో ఇచ్చిన బహుమతులు...అన్నీ అపురూపంగా దాచుకున్నాను. ఇహ నా గురించి అందరూ చెప్పిన మంచి మాటలు నా మనోఫలకంపై సువర్ణక్షరాలై నిలిచిపోయాయి. నా శేషజీవితమంతా ఆ మాటలు కలిగించిన ఆనందంతో, స్ఫూర్తితో గడిపేయవచ్చు.'

ఇంటికి వచ్చాక లలితతో అవన్నీ పదేపదే వర్ణించి మరీ చెప్పాను. ఆమె ఎంతగానో సంతోషించింది.

'అరెరె.. నేనుకూడా వస్తే బాగుండేదండీ' అన్నది. నిజమే. ఆమె వచ్చి ఉండుంటే నాకు జరిగిన ఆ సన్మానానికి, ఆ గౌరవానికి ఎంతో పొంగిపోయేది. నాకే ఎందుకో ఆమెను పిలుద్దామని తట్టలేదు. పదేపదే రాత్రంతా అదే మాట్లాడుకుంటూ ఉన్నాము.

నేను, నా ఉద్యోగం మొదలు పెట్టిన నాటినుండి నేటివరకూ చేసిన ఊళ్లు, అక్కడ పరిచయమైన సహోద్యోగులు, నేను చేసిన గొప్ప పనులు, ఇవన్నీ తనివితీరా చెప్తూ పోయాను. ఎప్పుడో తెల్లవారుఝామున నిద్రపోయాము.

మర్నాడు పొద్దున లేచి లలిత ఇచ్చిన కమ్మటి కాఫీ తాగుతూ "కూర్చోవోయ్ నా భవిష్యత్తు ప్రణాళిక ఏమిటో నీతో చెప్తాను" అంటూ మొదలుపెట్టాను.

"ఏమేమీ చెప్పావు అది కూడా చెప్పు" అన్నాడు వెంకట్రావు.

"ఏముందీ పొద్దున లేచి కాఫీ తాగాక 7 నుంచి 8 వరకు వాకింగు, 8 గంటలకు వచ్చి పేపరు అదీ చూసి తొమ్మిదింటికి టిఫిన్, కాఫీ, పదిగంటలకు స్నానం, పదకొండు గంటల నుండి ఒంటిగంటవరకు రీజనల్ లైబ్రరీలో గడపడం, ఒకటిన్నరకు మధ్యాహ్న భోజనం, ఓ రెండు గంటలు కునుకు తీస్తే సాయంత్రం మళ్లీ కాసేపు అలా బజారుకో, ఏ సాహితీ సభకో హాజరై రాత్రి భోజనం, నిద్ర. అన్నీ సమయం ప్రకారం జరిగిపోవాలి. ఏదో రిటైరయ్యానుకదా అని తాత్సారంచేస్తే ఊరుకునేదిలేదు... తమాషాగా లలితను బెదిరించాను కూడా."

"ఇవన్నీ విని లలిత ఏమంది?" వెంకట్రావు కుతూహలంగా అడిగాడు.

"ఏమందీ? అవును...ఏమంది?" ఆలోచనలో పడ్డాడు.

"ఏమోరా! పెద్దగా గుర్తులేదు. అప్పుడు లలిత ఏవో కూరలు తరుక్కుంటోంది. నేను చెప్పడం అవగానే లేచి అవి పట్టుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఆ తరువాత మళ్లీ రెట్టించాడు వెంకట్రావు.

ఆ తరువాత అవును... ఆ తర్వాతే నిజమే... ఆ తర్వాత నుంచీ ఈ వరస మొదలైంది.

హఠాత్తుగా నా మెదడులో పొరలేవో విప్పుకున్నాయి. ఇప్పటివరకూ నేను పట్టించుకోని, తెలుసుకోని కొత్త కోణాలేవో నా మనసును తట్టిలేపాయి. వాటి ఫలితమే ఇవాల్టి ఈ వేడుక!

ఇంటి యజమానిగా డబ్బులు సంపాదించుకునే వ్యక్తిగా నాకు ఇంటికి ఆమె చేసిన సేవలన్నీ నా హక్కుగా, ఆమె బాధ్యతగా భావించాను నేను. ఒక గృహిణిగా ఆమెదీ అంతే ముఖ్యమైన పదవి అనీ గుర్తించలేదు. ఆమె శ్రమకు, సేవకు ఏనాడూ గుర్తింపును ఇవ్వలేదు.


అది ఒక పనిగానే భావించలేదు. ముప్పైయేళ్ల నా ఉద్యోగ జీవితంలో నాకు జీతంతోపాటు ఎన్నో ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, ప్రశంసలు, బహుమతులు,అటుపిమ్మట పదవీ విరమణ... కానీ కానీ ఆమె నలభై ఏళ్ల గృహిణి జీవితానికి జీతం భత్యం ఏమీలేవు. ప్రశంసలు లేవు. పదవీ విరమణ అంతక



## వేలిముద్రలు ఇక చెరపలేము

ఇంతకాలంగా నేరస్థుడు నేరస్థలంలో తను ముట్టుకున్న వస్తువులని బట్టతో తుడిచివేస్తే తను పట్టుబడనని మనం భావిస్తూ వచ్చాము. ఇటీవల లెసెస్టర్ యూనివర్శిటీ సైంటిస్టులు కనుక్కున్న ఫోరెన్సిక్ టెక్నిక్ కనుక అందుబాటులో వుంటే వేలిముద్రల్ని తుడిచేసినా సరే సైంటిస్టులు పట్టుకోగలుగుతారుట. అంటే ఒకసారి ఒకరి వేలిముద్ర పడ్డాక బట్టతో తుడిచేసినా సైంటిఫిక్ టెస్టుల ఆధారంగా ఆ వేలిముద్రని పట్టుకోవచ్చునట. దీనివల్ల గతంలో ఆధారాలులేక మూసివేసిన క్రిమినల్ కేసుల్ని మళ్లీ తెరిచి నేరస్థుల్ని పట్టుకోవచ్చునని బ్రిటిష్ పోలీసు శాఖవారు ఆనందపడుతున్నారు.

-తటవర్తి




న్నాలేదు. అసలు వెలకట్టలేని ఆమె సేవలకు నా దృష్టిలో, మనందరి దృష్టిలో విలువేలేదు. ఇన్నాళ్ల, ఇన్నేళ్ల నా తప్పుకు ప్రాయశ్చితంగా నేను చేసిన తప్పు ఇకముందు మరెవ్వరూ చేయకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈనాడు సభాముఖంగా నా తప్పుకు క్షమాపణ కోరుతున్నాను'' ఆయన స్వరం గద్గదమైంది.

వింటున్న లలిత కళ్ల నిండా నీళ్లు... సభలో కలకలం.

"నేను ఏమి చేసినా ఆమె రుణం తీర్చుకోలేనని నాకు తెలుసు. కానీ ఈ చిన్న సన్మానం నేను నా పిల్లలు కలసి లలితకు తెలియకుండా ఏర్పాటు చేసాం''

ఆ మాట వినగానే లలిత కళ్లు ఆశ్చర్యంతో, ఆరాటంతో పిల్లలకోసం వెదికాయి.


'అమ్మమ్మా... నాన్నమ్మ' అంటూ మనవలు, మనవరాళ్లు చాటు నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి ఆమెను స్టేజీమీదకు తీసుకువెళ్లారు.



## పూలు ఇచ్చేటప్పుడు జాగ్రత్త

రష్యాలో ఎవరికైనా పూలు పట్టుకుని వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలిట. ప్రేమికులకి, పండుగల సందర్భాలలో పూలు బేసి సంఖ్యలో ఉండాలిట. అలాగే విషాద సంఘటనల్లో, సమాధులపై పూలు ఉంచేటప్పుడు సరి సంఖ్యలో ఉండాలిట.

-తటవర్తి




పెద్దమనవడు, మనవరాలు వచ్చి ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించారు. ఆమె ఆ పుష్పగుచ్ఛాలు అందుకుని వారిద్దరినీ దగ్గరకు తీసుకుని ముద్దాడింది.

వెనుకగా కూతురు, కోడలు వచ్చి పెద్ద పూలమాలను ఆమె మెడలో వేసారు. కొడుకు, అల్లుడు వచ్చి ఒక చక్కటి ఖరీదైన శాలువా కప్పారు. ఆమె ఇంకా ఆ ఆనందాశ్చర్యాలలో తేరుకునే ముందే ప్రకాశరావు మైకు ఆమె చేతికి ఇచ్చాడు.

లలిత కళ్లు తుడుచుకుంటూ "ఇంత అద్భుతమైన అభినందన సభ ఏర్పాటు చేసిన మా వాళ్లకు, వచ్చిన మీకందరికీ నమస్కారం. ఏ స్త్రీ కూడా తన గృహిణి జీవితం నుండి రిటైర్‌మెంట్ కోరుకోదు. అలా చూస్తే అది ఆమెకు బ్రతుకు నుండి విరమించడమే అవుతుంది. అయితే ఆమె కోరుకునేది, తను చేసే పనులకు రవ్వంత గుర్తింపు, గోరంత తోడ్పాటు, వ్యక్తిగా నాకంటూ కాస్తంత చోటు, సమయం. పెళ్లయిన కొత్తల్లో ఆడబడుచు, అత్త మామాగార్ల బాధ్యతలతో, ఆపై కొన్నాళ్లకు పిల్లలు, వారి పసితనం, ఊపిరి సలపని పనులు. ఆ తరువాత వారి స్కూలు, కాలేజీ జీవితాలు, వారిని చదివించడం, చెడుతోవ పట్టకుండా చూసుకోవడం, కుటుంబ సభ్యులందరికీ భోజనం తయారీ, ఇతర ఇంటి పనులు ఎప్పుడూ ఉండేవే. ఇన్ని బాధ్యతల మధ్య ఎప్పుడూ నేను అర్రులు చాచింది, నాకు దొరకనిదీ నాకంటూ కాస్తంత సమయం, నేను ఒంటరిగా ఉండి నా భావాలను నాతో నేనే పంచుకునే చోటు.

పిల్లల చదువులు, పెళ్లిళ్లు అయి స్థిరపడ్డాక కొంత వెసులుబాటు దొరికింది. ఆయన రిటైర్‌మెంట్ అయ్యాక ఇహ నాకంటూ వీలు చిక్కించుకో వచ్చు అని ఆశపడ్డాను. కానీ ఆయన రిటైర్ అయి అవగానే భావి జీవితపు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇందులో ఇంటి పనిలో సహాయానికిగానీ, నాకుగానీ ఎక్కడా స్థానం కల్పించలేదు. అసలు నావైపు నుండి ఆలోచించలేదు. 'నీ గానుగెద్దు జీవితపు టైమ్ టేబుల్ ఏమాత్రం మారడానికి వీలులేదు సుమా' అని నవ్వుతూనే హెచ్చరించారు కూడా.

మీలో చాలామందికి తెలుసు నాకు మోకాళ్ల నొప్పులు. డాక్టర్ దగ్గరకు వెళ్తే వాకింగ్ చేయమంటాడు. పొద్దున పూట వెళ్లామంటే పాలవాడు, పేపరు, పనిమనిషి, చాకలి... ఇలా ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. ఆపైన ఇంటి పని, వంట పని మామూలే.

ఇహ సాయంత్రాలు, ఇంటికి తాళం వేసి ఆయనకు ఇష్టంలేదు. ఆయన వచ్చేసరికి నేను ఇంట్లో ఉండాలి. చక్కగా తయారై కాఫీ, టిఫిన్‌తో ఎదురవ్వాలి. ఇన్ని ఆంక్షల మధ్య నా నడక ఇంకెక్కడా సాగేను. అలాగే ప్రతి శుక్రవారం గుడికి వెళ్లాలని నా కోరిక. ఎన్ని ఇక్కట్లో చెప్పలేను. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో... నా ఇష్టాలు, అవసరాలు, అభిరుచులు అన్నిటికీ ఆఖరి స్థానమే ఉండడంతో పెద్ద నుండి చిన్నవరకు అందరి పనులు అవసరాలు ముగిసాకే నేను నా గురించి ఆలోచించాల్సిన పరిస్థితి. నేను ఒక స్త్రీగా, ఒక గృహిణిగా, తల్లిగా, భార్యగా నేను కోరుకునేది ఒక్కటే. ఇంటి పని, వంట పని చేసేవారు కూడా మనుష్యులే. వారికీ కొన్ని ఆలోచనలు, అభిరుచులు, ఆశయాలు ఉంటాయి.

వారికి కొంతలో కొంత మీ సహకారం అందించండి. వారి పనుల్లో తోడ్పడండి. వారు చేసిన పనిని గుర్తించండి. అప్పుడప్పుడూ అయినా ఒక చిరునవ్వు, ఒక ప్రశంస, ఒక మెచ్చుకోలు అందివ్వండి. అదే వారు కోరుకునేది. ఇన్నాళ్టికి నా మనసు అర్థం చేసుకున్నందుకు ఈయనకు...'' లలిత భావోద్వేగంతో గొంతు బొంగురుపోగా మాట్లాడటం మానేసింది.

☆